ఈనాడు
మెదక్
శుక్రవారం అక్టోబరు 25, 2024

మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తుల పరిశీలన


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, న్యూస్‌టుడే: భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి జిల్లాలో దాఖలైన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. పట్టణ ప్రణాళిక, వార్డు అధికారులతో గురువారం కలెక్టరేట్ లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలకు ఇచ్చిన ప్రణాళిక ప్రకారం ప్రక్రియ జరగాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్జీలను పరిశీలించాలన్నారు. అవసరమైతే మండల స్థాయిలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

కష్టపడితేనే లక్ష్య సాధన


ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్, న్యూస్‌టుడే: కష్టపడితేనే లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఓపెన్ హౌజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయుధాలపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉన్నత స్థానాలకు చేరిన వారంతా మధ్య తరగతి వారేనని పేర్కొన్నారు. కుటుంబ పరిస్థితులను విద్య మార్చేస్తుందన్నారు. తల్లితండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించి, రహదారి, ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలన్నారు. అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ రంగనాయక్, ఆర్ఐ శైలేందర్, ఎఆర్ ఎస్సైలు నరేష్, భవానికుమార్, మహిపాల్ పాల్గొన్నారు.

చెంతకొచ్చెను.. కల నెరవేరెను



న్యూస్‌టుడే, మెదక్: వైద్యవిద్య అభ్యసించాలంటే విపరీతమైన పోటీని ఎదుర్కొని నిలవాలి. ప్రతిభ ఉన్నా, అందరికీ సీటు లభించడం గగనం. ఇటువంటి పరిస్థితుల్లో ఎంత దూరమైనా వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు పరిస్థితిలో మార్పు వచ్చింది. మన రాష్ట్రంలో వైద్య కళాశాలల సంఖ్య పెరిగింది. ఫలితంగా మరిన్ని సీట్లు అందుబాటులోకి వచ్చాయి. దూరప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా పోయింది. మెదక్ పట్టణంలో వసతులు సమకూరుతున్నాయి. జిల్లా కేంద్రంగా ఏర్పాటు, రైల్వే లైన్ సౌకర్యం, తాజాగా ప్రభుత్వ వైద్య కళాశాల అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురువారం వైద్య కళాశాల తరగతుల ప్రారంభ సమావేశానికి ప్రవేశం పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని 'న్యూస్‌టుడే' పలకరించింది. అభిప్రాయాలు వారి మాటల్లోనే...

కార్డియాలజిస్ట్ అవుతా: నందిని రాథోడ్, పెద్దశంకరంపేట



మా ఊరు పెద్దశంకరంపేట. నాన్న వెంకట్‌రాథోడ్, అమ్మ స్రవంతి ప్రభుత్వ ఉపాధ్యాయులు. పదోతరగతి వరకు మెదక్‌లోనే చదువుకున్నా. ఇంటర్‌కు హైదరాబాద్‌కు వెళ్లా. లాంగ్‌టర్మ్ శిక్షణ తీసుకున్నా. కౌన్సెలింగ్‌లో మెదక్ కళాశాలను ఎంపిక చేసుకున్నా సీటు లభించింది. సొంత జిల్లాలో వైద్యవిద్య చదవడం ఆనందంగా ఉంది. భవిష్యత్తులో కార్డియాలజిస్ట్ అవుతా.

గర్వంగా ఉంది..: సుజిత్, సంగారెడ్డి



మాది సంగారెడ్డి. నాన్న మల్లేశం ప్రభుత్వ ఉద్యోగి, అమ్మ భాగ్య గృహిణి. ప్రైవేట్ పాఠశాల, కళాశాలలో చదివా. కౌన్సెలింగ్‌లో మెదక్ ఎంచుకున్నా. వైద్య విద్య చదవడం గర్వంగా ఉంది. ఈ కోర్సు పూర్తి కాగానే, కార్డియాలజీలో చేరుతా.

ఉన్నత స్థానానికి చేరడమే లక్ష్యం: మాన్సి, పటాన్‌చెరు



మాది పటాన్‌చెరు. ఇంటర్ ప్రైవేట్ కళాశాలలో చదివా. లాంగ్‌టర్మ్ శిక్షణ తీసుకుని సన్నద్ధమై, సీటు సాధించా. కళాశాలలో చేరికతో కల నెరవేరింది. నాన్న భాస్కర్ నాయుడు అకౌంటెంట్. అమ్మ వీరా ప్రైవేట్ ఉపాధ్యాయురాలు. భవిష్యత్తులో వైద్యురాలిగా ఉన్నత స్థానంలో నిలవాలన్నదే లక్ష్యం.

చిన్నతనం నుంచే: అమూల్య, మహబూబ్‌నగర్



మాది మహబూబ్‌నగర్ జిల్లా బండమీదిపల్లి గ్రామం. బంధువుల్లో ఆయుర్వేద, దంత వైద్యులున్నారు. చిన్నవయసు నుంచే వైద్యురాలిని కావాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నా. ప్రైవేట్‌లో విద్యాభ్యాసం పూర్తి చేశా. నాన్న నాగన్న మండల వ్యవసాయాధికారి, అమ్మ స్వప్న ప్రైవేట్ ఉపాధ్యాయురాలు.

కుటుంబ సభ్యులను చూసి..: దీపేంద్ర, హైదరాబాద్



మాది హైదరాబాద్. అన్నయ్య వైద్యుడు. ఆయన స్ఫూర్తితోనే వైద్య విద్య చదవాలనుకున్నా. అమ్మ, భవాని గృహిణి, నాన్న సన్నీ ప్రైవేట్ ఉద్యోగి. మెదక్‌లో సీటు రావడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో కార్డియాలజిస్టనవుతా.

రూ.185 కోట్లతో వైద్య కళాశాలకు పక్కా భవనం


మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, చిత్రంలో మంత్రి కొండా సురేఖ, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్, న్యూస్‌టుడే: ప్రజలకు విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. గురువారం పిల్లికొట్టాల్‌లో నూతన ప్రభుత్వ వైద్య కళాశాల తరగతులను ఆయన మంత్రి కొండా సురేఖతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ వైద్య కళాశాల భవనం నిర్మాణానికి 20 ఎకరాల భూమి సేకరించామని, రూ.185 కోట్లతో భవనాన్ని నిర్మిస్తామన్నారు. కళాశాలకు అనుబంధంగా 220 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామని, వచ్చే విద్యా సంవత్సరంలో నర్సింగ్ కళాశాల, పారా మెడికల్ కళాశాలను మంజూరు చేస్తామన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ మోదీ ప్రధాని అయ్యాక 756 జిల్లాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, పదేళ్లలో దేశవ్యాప్తంగా 387 నూతన వైద్య కళాశాలలను ఏర్పాటు చేశారన్నారు.

● ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. వైద్యం, వ్యవసాయం, జిల్లా గ్రామీణ అభివృద్ధి, మార్కెటింగ్ సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు

రాష్ట్రంలో మధుమేహం, క్యాన్సర్, రక్తపోటు, గుండెపోటు వంటి వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని, వీటి నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ప్రతి జిల్లాలో పాలియేటివ్ కేర్, సంచార స్క్రీనింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. వ్యాధిగ్రస్తులు జంటనగరాలకు రాకుండా, వీటిల్లోనే 95 శాతం వైద్యం జిల్లాల్లోనే అందుతుందన్నారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందనరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, డీఎంఈ వాణి, కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు.

రాజగోపురంలో వనదుర్గకు పూజలు



సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద వరద ప్రవాహం కొనసాగుతోంది. గురువారం కూడా ఆలయం వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉండడంతో రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగాయి.
– న్యూస్‌టుడే, పాపన్నపేట,

సివిల్ సర్వీసెస్ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన


మనోహరాబాద్‌లో అధికారులతో వైద్యసిబ్బంది

మనోహరాబాద్, కౌడిపల్లి, రామాయంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందజేస్తున్న వైద్య సేవలు బాగున్నాయని సివిల్ సర్వీసెస్ అధికారులు కితాబునిచ్చారు. మనోహరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం వారు పరిశీలించారు. కౌడిపల్లి మండలం రాయిలాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఉన్నత పాఠశాలను అధికారులు సందర్శించారు. గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. రామాయంపేట మండలం ప్రగతి ధర్మారంలో వైకుంఠ ధామాన్ని, పల్లె ప్రకృతి వనాన్ని అధికారులు పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ సంజయ్‌దూబే

నర్సాపూర్: రక్తదానం ప్రాణదానంతో సమానమని బీవీఆర్ఐటీ ప్రిన్సిపల్ సంజయ్‌దూబే అన్నారు. నర్సాపూర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానంతో క్షతగాత్రుల ప్రాణాలను కాపాడొచ్చన్నారు. డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, రవీంద్రబాబు, డాక్టర్ దశరథ రామయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వే ప్రారంభం

రామాయంపేట, నార్సింగి (చేగుంట), న్యూస్‌టుడే: వచ్చే సీజన్‌లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంట సర్వే చేపట్టామని రామాయంపేట ఇన్‌ఛార్జి ఏడీఏ రాజ్‌నారాయణ అన్నారు. గురువారం మండలంలో జరుగుతున్న సర్వేను పరిశీలించి మాట్లాడారు. డివిజన్ పరిధిలోని 14 క్లస్టర్లలో వ్యవసాయ విస్తరణ అధికారులు యాప్ ద్వారా పంట సర్వేను చేపట్టారన్నారు. ఎంత విస్తీర్ణంలో పంట సాగు అవుతుందనే విషయం తెలుస్తుందన్నారు. నార్సింగిలో ఏఈవోల ప్రారంభించారు. నార్సింగిలో ఏఈవో విజృంభన రైతుల పొలాల వద్దకు వెళ్లి సర్వే చేపట్టారు.

కేంద్రాలతో దళారులకు అడ్డుకట్ట


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి, చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: దళారులకు అడ్డుకట్ట వేసేందుకే ప్రభుత్వం వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండలంలోని వెంకట్రావ్‌పేట, నాగ్సాన్‌పల్లి, సలాబత్‌పూర్ గ్రామాల్లో గురువారం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంక్షలు లేకుండా సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో స్వప్న పాల్గొన్నారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. చిలప్‌చెడ్ మండలంలోని గంగారం, శీలంపల్లి, అజ్జమర్రి, బండ పోతుగల్, ఫైజాబాద్, చిలప్‌చెడ్, చిట్కుల్, చండూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వడ్ల తరలింపునకు లారీల కొరత ఉంటే, రైతుల ట్రాక్టర్లు తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ముసాదిక్, ఎంపీడీవో ఆనంద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, భారాస నాయకుల వాగ్వాదం

శివ్వంపేట, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం సందర్భంగా కాంగ్రెస్, భారాస నాయకుల మధ్య గురువారం వాగ్వాదం జరిగింది. మండలంలోని పెద్దగొట్టిముక్ల గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించాల్సి ఉంది. ఆమె సమయానికి రాకపోవడంతో, శివ్వంపేట సహకార సంఘం ఛైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి, వైస్‌ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు, అధికారులు కేంద్రాన్ని ప్రారంభించారు. శివ్వంపేట సహకార సంఘం కార్యాలయం వద్ద ఛైర్మన్ రాకుండానే, భారాసకు చెందిన డైరెక్టర్లు యాదాగౌడ్, భిక్షపతిరెడ్డి, పెంటగౌడ్ కేంద్రాన్ని ప్రారంభించారు. దీనిని ఛైర్మన్ ప్రశ్నించడంతో భారాస, కాంగ్రెస్ నాయకుల మధ్య గొడవ జరిగింది. రెండు ప్రాంతాల్లో జరిగిన ఘటనలపై ఇరు పార్టీల నాయకులు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. శివ్వంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, సిబ్బందితో వచ్చి వారికి సర్ది చెప్పారు.

కోర్టు ఏర్పాటుకు చర్యలు

తూప్రాన్ న్యూస్‌టుడే: తూప్రాన్ పట్టణానికి మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు గురువారం భవనాలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోర్టు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అనువైన భవనాన్ని త్వరలోనే ఖరారు చేసి అధికారులకు నివేదిక సమర్పిస్తామన్నారు. ఆయన వెంట తహశీల్దార్ విజయలక్ష్మి, న్యాయవాదులు శ్రీనివాస్, అశోక్ ఉన్నారు.

కేసీఆర్ వల్లే వైద్య కళాశాల

మెదక్, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టుదల వల్లే మెదక్ పట్టణానికి ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరైందని మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, కిషోర్, శ్రీనివాస్, జయరాజ్ అన్నారు. గురువారం వారు మెదక్‌లో విలేకరులతో మాట్లాడారు. కళాశాల మంజూరులో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి కృషి ఉందన్నారు. వైద్య కళాశాలలో సీట్ల సామర్థ్యాన్ని వందకు పెంచాలని భారాస జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.

ఉద్యాన పంటలకు ఊతం



న్యూస్‌టుడే, మెదక్‌టౌన్: వినియోగానికి అనుగుణంగా కూరగాయలు, పండ్ల దిగుబడులు లేక ధరలు పెరుగుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని వీటి సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. వరికి బదులుగా వాణిజ్య పంటలపై దృష్టి సారించేలా కార్యాచరణ చేపట్టింది. జిల్లాలో పండ్ల తోటలు మూడు వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. వాతావరణ ప్రభావం, తెగుళ్ల కారణంగా ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడంలేదు. ఇతర ప్రాంతాల నుంచి తీసుకురావాల్సి వస్తోంది. ఈ ఏడాది జిల్లాలో మరో 1000 ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

13 రకాల పండ్ల తోటల పెంపకం

పండ్ల తోటల సాగుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ నిధులను మంజూరు చేయనుంది. బిందు సేద్యంలో మామిడి, దానిమ్మ, కొబ్బరి, జామ, సపోట, సీతాఫలం, డ్రాగన్‌ఫ్రూట్, మునుగ, బత్తాయి, జీడిపప్పు, నేరేడు, నిమ్మ తదితర 13 రకాల పంటల సాగుకు అవకాశం కల్పించింది. రాయితీపై బిందు పరికరాలను ఇవ్వనున్నారు.

పండ్ల మొక్కలను ఉచితంగానే ప్రభుత్వం అందజేస్తుంది. అవి నచ్చకుంటే రైతుకు నచ్చిన చోట కొనుగోలు చేసుకునేందుకు డబ్బులు చెల్లిస్తుంది. నాటిన మొదటి సంవత్సరం నుంచి, కాపాడిన మొక్కల ప్రకారం ఏటా యూనిట్ విలువ ప్రకారం మూడేళ్ల వరకు రైతులకు డబ్బులు చెల్లించనున్నారు.

ఎంపిక విధానం: జాబ్‌కార్డుతో పాటు, 5ఎకరాల్లోపు భూమి, నీటి వసతి, విద్యుత్తు కనెక్షన్ ఉండాలి. జాబ్‌కార్డు లేని వారు ఎంపీడీవోకు దరఖాస్తు చేసుకోవాలి. జాబ్ కార్డు, ఆధార్, పట్టపాసు పుస్తకం నకళ్లతో ఏఈవో, ఏవో, ఎంపీడీవో, ఉద్యాన అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం గ్రామసభలో తీర్మానం పొందాక పనులు చేపడతారు. ఈ సారి ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం రాయితీతో బిందు పరికరాలు. ఇతర సామాజిక వర్గాలకు 90 శాతం రాయితీపై పరికరాలను అందజేయనున్నారు.

రెండు రకాలుగా ఆదాయం

పండ్ల తోటల మధ్యలో అంతర్గత పంటలు సాగుచేసే అవకాశం ఉంది. ఇందుకోసం రైతు ఖాతాలో ఏటా రూ.3,000- రూ.4,000 జమచేస్తారు. పండ్ల మొక్కలు కాతకు వచ్చేంతవరకు నిరీక్షించకుండా అంతర్గత పంటల ద్వారా ఆదాయం పొందే అవకాశం ఉంది.

మూడేళ్ల వరకు బాధ్యత:

ఎంపికైన రైతులు ఉపాధి పనుల్లో భాగంగా గుంతలు తవ్వించవచ్చు. ఒక వేళ యంత్రం ద్వారా చేయిస్తే, ఆ ఖర్చు రైతులకు చెల్లిస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: శ్రీనివాసరావు, డీఆర్డీవో

ఉపాధి హామీలో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం. మొక్కలు కొనుగోలు నుంచి నాటడంతో పాటు నిర్వహణ ఖర్చులు సైతం మంజూరు చేస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరం వరకు రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. లాభదాయకమైన పండ్ల తోటల సాగు చేపట్టాలి.

దారంతా ధాన్యమే



వరి పంట చేతికి రావడంతో గ్రామాల్లో ముమ్మరంగా వరి కోతలు జరుగుతున్నాయి. రైతులు వడ్లను తెచ్చి రహదారిపై పోసి ఆరబెడుతున్నారు. చేగుంట నుంచి బోనాలకు వెళ్లే మార్గం వడ్లతో నిండిపోయింది. ఉల్లితిమ్మాయిపల్లి నుంచి రుక్మాపూర్, ఇబ్రహీంపూర్ నుంచి బోనాల వరకు ఎటు చూసినా రోడ్డుకు ఒక వైపు ధాన్యమే కనిపిస్తోంది. వాహనచోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది. – న్యూస్‌టుడే, చేగుంట

ప్రమాద మార్గం.. అప్రమత్తతే శరణ్యం



రామాయంపేట పురపాలికలో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి దెబ్బతిని గుంత ఏర్పడింది. ఇటీవల ఓ యువకుడు గుంతలో పడి ప్రమాదానికి గురయ్యాడు. దీనిని గుర్తించేందుకు స్థానికులే కర్రను ఏర్పాటు చేసి, రాళ్లు అడ్డుపెట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రామాయంపేట

సమకూరని సమీకృతం


నర్సాపూర్‌లో అసంపూర్తిగా..

న్యూస్‌టుడే, నర్సాపూర్, మెదక్‌టౌన్, తూప్రాన్, రామాయంపేట: ప్రతి పురపాలికలో సమీకృత మార్కెట్లు ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో పనులు ప్రారంభించారు. వీటికి పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయకపోవడంతో మధ్యలోనే ఆగిపోయాయి. మెదక్, నర్సాపూర్, రామాయంపేటల్లో ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రజలకు ఒకేచోట కూరగాయలు, చేపలు, మాంసం, లభించేలా వీటిని నిర్మించాలని సంకల్పించినా, ప్రగతి కనిపించడంలేదు.

నిధుల్లేక నిలిచిన పనులు

అసంపూర్తిగా

నర్సాపూర్‌లో పాత తహశీల్దార్ కార్యాలయం స్థలంలో రూ.5 కోట్లతో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులో పనులు నిలిచిపోయాయి. కార్లు, ద్విచక్రవాహనాల పార్కింగ్‌కు విశాలమైన స్థలం సైతం కేటాయించారు. ఆకట్టుకునే ప్రవేశ ద్వారం, దుకాణాల ఏర్పాటుకు 8 ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినా, అసంపూర్తిగా దర్శనమిస్తోంది.

ఎక్కడి పనులు అక్కడే..: రామాయంపేట పట్టణంలో రూ.2కోట్లతో రెండేళ్ల కిందట నిర్మాణం ప్రారంభించారు. కొంత పిల్లర్లు, మరికొంత పునాదుల స్థాయిలో పనులు నిలిచిపోయాయి. బిల్లులు రాకపోడంతో మధ్యలోనే ఆపేశారు. ఆ ప్రాంతంలో పొదలు పెరిగాయి. పట్టణంలో ప్రతి బుధవారం అంగడి రోడ్లపైనే కొనసాగిస్తున్నారు. సిద్దిపేట-రామాయంపేట ప్రధాన రహదారిపై చేపలు విక్రయిస్తున్నారు. ప్రధాన మార్గంలో కూరగాయల అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో పట్టణంలోకి రాకపోకలు సాగించేందుకు అవస్థలు తప్పడం లేదు.



మెదక్‌లో ఇదీ దుస్థితి

పిల్లర్లకే పరిమితం

మెదక్‌లో నీటి పారుదలశాఖ భవనాల సముదాయంలో రూ.11.50 కోట్లతో పనులు ప్రారంభించారు. అయితే పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయాయి. దీనిని పూర్తి చేసి అందుబాటులోకి తెస్తే ప్రయోజనం ఉంటుంది. ప్రస్తుతం పెద్దబజార్‌లో కూరగాయల మార్కెట్‌లో రోడ్లపై కూర్చుని అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో ఆ మార్గంలో వెళ్లే వారు అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని డీఈ మహేష్ వద్ద ప్రస్తావించగా నిధులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారు పనులను నిలిపివేశారన్నారు.

వ్యాపారులు ముందుకు రాక..

తూప్రాన్‌లో నిర్మాణం పూర్తయినా, పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రావడం లేదు. 85 దుకాణాల్లో 8 మాత్రమే వినియోగంలోకి తెచ్చారు. గతేడాది సెప్టెంబరులో దీనిని ప్రారంభించారు. అప్పటి నుంచి ఇదే పరిస్థితి. మొదటి అంతస్తులో కూరగాయలు, రెండో అంతస్తులో మాంసం, చేపల విక్రయం, మూడో దాంట్లో దుకాణ సముదాయం ఏర్పాటు చేశారు. మూడు సార్లు టెండర్లు పిలిచినా వ్యాపారులు ముందుకు రాలేదు. ఈ విషయాన్ని మార్కెటింగ్ కార్యదర్శి జాన్‌వెస్లీ వద్ద ప్రస్తావించగా కొత్త దాంట్లో వ్యాపారాలు సాగడం లేదని, కొందరు పాత మార్కెట్ స్థలంలోనే ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు.


తూప్రాన్‌లో నిరుపయోగంగా

నాణ్యమైన బోధన అందించడమే ధ్యేయం


ప్రాథమిక పాఠశాల తనిఖీ చేస్తున్న డీఈవో రాధాకిషన్

రామాయంపేట, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ సూచించారు. గురువారం మండల పరిధి లక్ష్మాపూర్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకుని, వారితో పాఠాలు చదివించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎంఈవో సుదర్శనమూర్తి, ప్రధానోపాధ్యాయుడు నర్సాగౌడ్, ఉపాధ్యాయులు దివ్య, శంకరయ్య ఉన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులు తొలగించాలి: ఎస్ఎఫ్ఐ

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫిట్‌నెస్ లేని బస్సుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ అన్నారు. గురువారం సంఘం నాయకులతో కలిసి డీఈవో రాధాకిషన్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఎంఈవోలు పాఠశాలు తనిఖీలు చేయకనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. నాయకులు అజయ్, భాను తదితరులున్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక ఆదాయం

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ఆయిల్‌పాం సాగుకు రైతులు ముందుకు రావాలని జిల్లా ఉద్యానాధికారి ప్రతాప్‌సింగ్ కోరారు. కౌడిపల్లి మండలం తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 2వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇతర పంటల కంటే ఆయిల్‌పాం సాగుచేస్తే రైతులు అధిక ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుందన్నారు.

రుణ సహకారం.. అభ్యున్నతికి దోహదం

మహిళా సంఘాల సభ్యులను ప్రోత్సహిస్తున్న డీసీసీబీ

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

రైతులకు అన్ని విధాలుగా సహకారం అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటుచేసిందే డీసీసీ బ్యాంకు. కర్షకులకు రుణాలు ఇస్తూ, వాటిని వసూలు చేస్తుంటుంది. అయితే ఇటీవల కాలంలో డీసీసీబీ తన పంథాను మార్చుకొని ముందుకు సాగుతోంది. మహిళలకూ సహకారం అందిస్తోంది. ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించడంలోనూ ముందుంటోంది. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సంఘాలకు రుణాల అందిస్తోంది. వసూలైన వడ్డీలో కొంత మొత్తాన్ని తిరిగి చెల్లిస్తోంది. ఈ విషయంలో రాష్ట్రంలోనే మెదక్ డీసీసీబీ ముందంజలో నిలవడం విశేషం.

రాష్ట్రంలో మొత్తం తొమ్మిది డీసీసీబీలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఏర్పాటుచేశారు. వీటి ద్వారా మహిళా సంఘాలకు రుణాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా రూ. 440.01 కోట్లు పంపిణీ చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో రుణ పంపిణీలో రాష్ట్రంలో తొలిస్థానంలో నిలిచి ప్రభుత్వ పురస్కారం అందుకుంది. ఈ సారి కూడా అదే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. నాబార్డు సహకారంతో మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత పెంచేందుకు కృషి చేస్తోంది.

ఐదేళ్లలో మహిళా సంఘాలకు అందించింది..

సంవత్సరం	రుణాల పంపిణీ (రూ.కోట్లలో)
2020-21	309.09
2021-22	325.40
2022-23	393.56
2023-24	420
2024-25	440.11

(అక్టోబరు 20 వరకు)

బీమాపై అవగాహన

ప్రధానమంత్రి బీమా పథకాలను మహిళా సంఘాల సభ్యులకు అమలు చేస్తున్నారు. ఏడాదికి రూ. 12 చెల్లిస్తే ప్రమాద బీమా, రూ. 330తో సాధారణ బీమా పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ప్రమాద బీమా చేసుకున్న వారు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ. 2 లక్షలు, సాధారణ బీమాలో చేరిన వారు ఆత్మహత్య మినహా ఎలా మృతిచెందినా రూ. 2లక్షలు, రెండింటిలో చేరితే రూ. 4లక్షలు సాయం అందిస్తారు. సభ్యులకు వీటిపై అవగాహన కల్పిస్తున్నారు.

రూ.2 లక్షలు తీసుకొని..



సంగారెడ్డి జిల్లా సంగుపేటకు చెందిన వజ్రమ్మ.. స్థానిక చైతన్య పొదుపు సంఘంలో సభ్యురాలు. 12 ఏళ్లుగా పొదుపు చేస్తూ వస్తున్నారు. డీసీసీబీ నుంచి రూ. 2 లక్షల రుణం తీసుకొని.. కిరాణా దుకాణం, టీ హోటల్ నిర్వహిస్తున్నారు. దీని నిర్వహణతో వస్తున్న మొత్తాన్ని కుటుంబ పోషణకు వినియోగిస్తున్నారు. ప్రతి నెలా బ్యాంకు అధికారులకు క్రమం తప్పకుండా రుణ వాయిదాలు చెల్లిస్తున్నారు. **- న్యూస్‌టుడే, జోగిపేట**

నాటు కోళ్ల పెంపకంతో..



మెదక్ జిల్లా చేగుంట మండలం గొల్లపల్లి జైత్రాం తండాకు చెందిన నవజ్యోతి మహిళా సంఘానికి చెందిన లక్ష్మి డీసీసీబీ నుంచి రూ. 1.5 లక్షల రుణం తీసుకున్నారు. నాలుగు నెలల కిందట కోడి పిల్లల పెంపకాన్ని చేపట్టారు. 2,500 నాటు కోడి పిల్లలు తీసుకొచ్చి. . ఒక్కోటి 250 గ్రా. బరువు కాగానే విక్రయిస్తున్నారు. తీసుకున్న రుణాన్ని క్రమం తప్పకుండా చెల్లిస్తూ పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, చేగుంట**

5 శాతం తిరిగి చెల్లింపు

స్వయం సహాయక సంఘాలకు 12 శాతం వడ్డీపై రుణాలు అందిస్తున్నారు. హరీశ్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో ఆయన చొరవతో డీసీసీబీ పరిధి సంగారెడ్డి జిల్లాలోని సంఘాలకు వడ్డీలో 5 శాతం తిరిగి చెల్లిస్తున్నారు. 2020 జులైలో ఇది మొదలైంది. ఈ మొత్తాన్ని సంఘాల అభ్యున్నతికి వెచ్చిస్తున్నారు. ఇప్పటివరకు రూ. 1.50 కోట్లు జిల్లా సమాఖ్యకు అందజేయడం గమనార్హం. ఇలా వెనక్కి ఇచ్చిన వడ్డీలో ఒక శాతం జిల్లా సమాఖ్య, 2 శాతం మండల సమాఖ్యలకు, మిగతాది గ్రామైక్య సంఘాలకు కేటాయిస్తున్నారు.

సందడిగా ఎంపిక పోటీలు



క్రీడాకారులతో నాగరాజు, నగేష్, వంశీ, వినయ్

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: త్వరలో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటాలని ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు సూచించారు. గురువారం మెదక్‌లోని అవుట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. సిద్దిపేట, గజ్వేల్, సంగారెడ్డి, మెదక్, సదాశివపేట, జహీరాబాద్‌కు చెందిన 120 మంది పాల్గొన్నారు. జట్లుగా విభజించి పోటీలు కొనసాగించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు ఎం.అరుణ్ దినకరన్, శ్రీకాంత్, ఎం.డి. సొది, ఎం.జాన్‌పాల్‌లను ఎంపిక చేశారు. వీరు ఈ నెల 25 నుంచి 30 వరకు హైదరాబాద్ జింఖానా మైదానంలో జరిగే శిక్షణ శిబిరానికి హాజరుకానున్నారు. అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, సెలక్షన్ కమిటీ మెంబర్ నగేష్, ఫుట్‌బాల్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, వినయ్, శిక్షకుడు ప్రకాష్ పాల్గొన్నారు.

అఖిలభారత విశ్వవిద్యాలయాల ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక


చేగుంట: అఖిల భారత విశ్వవిద్యాలయాల ఫెన్సింగ్ (కత్తిసాము) పోటీలకు మెదక్ జిల్లా నుంచి ఐదుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు శిక్షకుడు కరణం గణేష్‌రవికుమార్ తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో జరిగిన విశ్వవిద్యాలయాల కత్తిసాము పోటీల్లో ఫాయిల్ విభాగంలో కరణం నిశాంత్, ఈపీ విభాగంలో శ్రీశాంత్, ముఖేష్, సాబేర్‌లో జవదుద్దీన్, ఈపీలో రాజేశ్వరిలు ప్రతిభ చూపారు. వీరు నవంబరు 6 నుంచి 10 వరకు జమ్ములోని యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు.

27న స్వేరోస్ జాతీయ సభ

బెజ్జంకి, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో ఈ నెల 27న నిర్వహించే స్వేరోస్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర చీఫ్ కన్వీనర్ బలుగూరి దుర్గయ్య కోరారు. గురువారం బెజ్జంకిలో కమిటీ నాయకులతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. సభకు స్వేరోస్ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధిక సంఖ్యలో హాజరయ్యేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. మహనీయుల ఆశయాల సాధనతో పాటు విద్యార్థుల ఉజ్వల భవితకు స్వేరోస్ కమిటీ కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య, ప్రకాశ్, కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జి మారుతి, జిల్లా అధ్యక్షుడు బాబు, రాష్ట్ర నాయకులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ప్రేమ విఫలమైందని యువకుడు..



విశ్వసాయి

సిద్దిపేట టౌన్: ప్రేమ విఫలమై ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన బోదనకారి విశ్వసాయి (22) మొబైల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. కొన్నాళ్లకు వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. బుధవారం రాత్రి విశ్వసాయి బయటకు వెళ్లాడు. కోమటిచెరువులో దూకి చనిపోతున్నానంటూ మిత్రులకు చరవాణిలో సందేశం పంపించాడు. వారు యువకుడి కుటుంబసభ్యులకు చేరవేశారు. వారు అక్కడికి చేరుకునేసరికి చెరువులో దూకాడు. పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో వెతికి మృతదేహాన్ని వెలికితీశారు. తల్లి జయమ్మ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఆర్థిక ఇబ్బందులతో అన్నదాత..



మహేందర్

చేర్యాల: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. మండలంలోని మర్రిముచ్చాలకు చెందిన వంగ మహేందర్‌రెడ్డి(56), సత్యలక్ష్మి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయమే జీవనాధారం. అకాల వర్షాలతో పంటలకు తెగుళ్లు సోకగా నష్టపోయాడు. రూ. 2.01 లక్షల రుణమాఫీ కాలేదు. దీంతో మనస్తాపం చెందాడు. గురువారం భార్యతో కలిసి పొలానికి వెళ్లాడు. పంటకు పురుగు మందు పిచికారీ చేశాడు. భార్యను అక్కడే వదిలేసి ఇంటికొచ్చి పురుగు మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే చనిపోయాడని తేల్చారు. మృతుడి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మద్యం తాగొద్దన్నందుకు రైతు..



శ్రీనివాస్

దుబ్బాక: మద్యం తాగొద్దని కుటుంబీకులు చెప్పడంతో మనస్తాపం చెందిన ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎస్సై గంగరాజు తెలిపిన వివరాలు.. పెద్దగుండవెల్లికి చెందిన పంజ శ్రీనివాస్ (49)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరు నెలల క్రితం అతడికి గుండె శస్త్రచికిత్స జరిగింది. అప్పటి నుంచి మందులు వాడుతూనే రోజూ మద్యం తాగుతున్నాడు. ఈ నెల 22న రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చాడు. కుటుంబీకులు నిలదీయగా గొడవ పడడు. బుధవారం తెల్లవారుజామున పొలం వద్ద కొట్టంలోకి వెళ్లి ఆత్మహత్యకు యత్నించాడు. గుర్తించిన కుటుంబీకులు 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య రాజమణి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కుటుంబ కలహాలతో..



నర్సింహులు

మాసాయిపేట (చేగుంట): కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. చేగుంట ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. చేగుంట ఠాణా పరిధి మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి పులిగుట్టతండాకు చెందిన నర్సింహులు (45), శాంతి దంపతులకు ముగ్గురు కుమారులు. కొంతకాలంగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. మనస్తాపం చెందిన నర్సింహులు బుధవారం రాత్రి పొలం వద్ద ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం కుటుంబీకులు లేచి చూసేసరికి కనిపించకపోవంతో అంతటా వెతికారు. పొలం వద్ద విగతజీవిగా కనిపించాడు. కేసు నమోదైంది.

చికెన్ ధరలు			
ఫాంరేటు	120–00	డ్రెస్డ్	206–00
రిటైల్	142–00	స్కిన్‌లెస్	234–00

ఆచరణలో ఆదర్శం.. స్వచ్ఛతలో మేటి

● సిద్దిపేటకు కితాబిచ్చిన 11 పురపాలికల అధికారులు



డీఆర్‌సీసీ కేంద్రం సందర్శనలో..

సిద్దిపేట, న్యూస్‌టుడే: స్వచ్ఛతలో సిద్దిపేట బల్దియా ఆచరణాత్మకంగా, ఆదర్శంగా నిలిచిందంటూ రాష్ట్రంలోని వివిధ పురపాలికల కమిషనర్లు, అధికారులు కితాబునిచ్చారు. తడి, పొడి, హానికర చెత్త నిర్వహణలో మేటిగా మారిందంటూ ప్రశంసించారు. గురువారం రాష్ట్రంలోని 11 పురపాలికల కమిషనర్లు, అధికారులు సిద్దిపేటలో పర్యటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ అంశాలు తెలుసుకున్నారు. బల్దియా అధ్యక్షురాలు మంజుల, కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, అధికారులు.. ఇక్కడి ప్రత్యేకతలను వివరించారు. తడి, పొడి, హానికర చెత్త వేర్వేరుగా సేకరణ తీరును తెలుసుకున్నారు. గృహ యజమానులు, విద్యార్థులు, ఉపాధ్యాయులను పలకరించారు. బుస్సాపూర్‌లో సీఎన్‌జీ (బయోగ్యాస్) ప్లాంట్, ఎఫ్ఎస్‌టీపీ (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్), డీఆర్‌సీసీ (పొడిచెత్త వనరుల సేకరణ కేంద్రం)ని పరిశీలించారు. స్వచ్ఛబడి విశేషాలు తెలుసుకున్నారు. కోమటిచెరువును సందర్శించారు. వైస్ ఛైర్మన్ కనకరాజు తదితరులు ఉన్నారు. చేర్యాల, దుబ్బాక, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, జనగాం, నర్సంపేట, వర్ధన్నపేట, సిరిసిల్ల, ఆర్మూర్, భీమ్‌గల్, బోధన్ పురపాలికల బృందాలు సందర్శించాయి. రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచిన మున్సిపాలిటీలను ఎంపిక చేశారని, వాటిలో సిద్దిపేట ఒకటని కమిషనర్ తెలిపారు. 46 పురపాలికల అధికారులు వస్తారన్నారు.


పీహెచ్‌సీలో యువకుడి దారుణ హత్య



వివరాలను సేకరిస్తున్న క్లూస్‌టీం

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: గుర్తు తెలియని యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన చిన్నశంకరంపేటలో గురువారం జరిగింది. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపిన ప్రకారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తెరిచేందుకు గురువారం ఉదయం వైద్య సిబ్బంది, మండల వైద్యాధికారిణి సాయిసింధూ వెళ్లారు. ఆసుపత్రి వెనుకభాగంలో ఉన్న తలుపు తీయగానే ఓ యువకుడు రక్తం మడుగులో పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్సై నారాయణ ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. తెల్లవారు జామున దుండగులు బండరాయితో యువకుడిపై దాడి చేసి, ఇష్టానుసారం కొట్టి హతమార్చారు. అనంతరం మొక్కల రక్షణకు ఉంచిన ట్రీగార్డులను మృతదేహంపై వేసి దహనం చేసేందుకు ప్రయత్నించారు. ముఖం గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. మండల వైద్యాధికారిణి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని, సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను పట్టుకుంటామని, యువకుడి వివరాలు తెలియాల్సి ఉందని డీఎస్పీ వివరించారు. పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న పీహెచ్‌సీలో ఈ ఘటన జరిగింది. దీంతో పట్టణ వాసులు భయాందోళనకు గురయ్యారు.

అనంతగిరి.. పక్షుల లోగిలి



న్యూస్‌టుడే, వికారాబాద్ గ్రామీణ: వికారాబాద్ అనంతగిరిలో పచ్చని చెట్లు, ఎత్తైన కొండలు మనసుదోచే ఆహ్లాదకర వాతావరణంతో పాటు వివిధ రంగుల్లో పక్షులు దర్శనమిచ్చి ప్రకృతి సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. అనంతగిరిలో మొత్తం 228 పక్షులు తలదాచుకుంటున్నాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు. వింత శబ్దాలు చేస్తుంటే సందర్శకులకు అక్కడి నుంచి వెళ్లాలనిపించదు. పక్షి ప్రేమికులు హైదరాబాద్ బర్డ్స్ అసోసియేషన్ వారు ప్రతి సంవత్సరం అనంతగిరి సందర్శించి పక్షుల చిత్రాలు తీస్తుంటారు. పాలపిట్ట, బ్లాక్‌డ్రోంగో, డవ్, రోజ్ బర్డ్ తదితర పక్షులు అడవిలో అలరిస్తున్నాయి. పక్షుల వివరాలు తెలుసుకునేందుకు నడకదారిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు మాత్రమే కనిపిస్తాయని సభ్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృత్యువాత



నాగరాజు

రామాయంపేట: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. రామాయంపేట ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని ఝాన్సీలింగాపూర్‌కు చెందిన నాగరాజు (36), లత దంపతులకు ముగ్గురు సంతానం. నాగరాజు తనకున్న రెండెకరాలను సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం పొలానికి వెళ్లగా, పంటకు నీరు పారించాలని మోటారు ఆన్ చేసేందుకు స్టార్టర్ డబ్బా వద్దకు వెళ్లాడు. ఫ్యూజ్ సరిచేసే క్రమంలో విద్యుత్తు తీగ తగిలి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడున్న వారు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదైంది.

చేపలవేటకు వెళ్లి..



సర్పాల్‌సింగ్

కుల్కచర్ల, న్యూస్‌టుడే: చేపలు పట్టేందుకు కుంటకు వెళ్లిన వ్యక్తి అందులోనే మునిగి మృతి చెందిన సంఘటన కుల్కచర్ల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. సర్పాల్‌సింగ్ (36) ఇనుప సామాన్ల దుకాణంలో కూలీ. గురువారం స్థానిక కుంటలో చేపలను పట్టేందుకు వెళ్లాడు. ఈత రాకున్నా.. స్నానం చేసేందుకు అందులోకి దిగుతుండగా అతడి బంధువు వారించాడు. అయినా వినకుండా దిగి నీటమునిగిపోయాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. అతడికి ఇద్దరు కూతుళ్లు, ముగ్గురు కుమారులున్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ..

అల్లాదుర్గం: రోడ్డు ప్రమాదంలో ఓ కూలీ మృతి చెందాడు. మెదక్ జిల్లా అల్లాదుర్గం ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని సీతానగర్‌కు చెందిన వెంకయ్య (60), తులసమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అందరికీ వివాహాలయ్యాయి. భార్యాభర్తలిద్దరూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వెంకయ్య గురువారం పెద్దశంకరంపేటలో జరిగిన వారాంతపు సంతకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నాగయ్య ఆటో ఎక్కాడు. మార్గమధ్యలో రాంపూర్ శివారులో రాగానే ఆటో బోల్తాపడి ఉంది. ఈ ఘటనలో వెంకయ్య అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో డ్రైవరు నాగయ్యకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రుడిని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రమాదం ఎలా జరిగిందనేది తెలియరాలేదు. ఘటనాస్థలిలో ట్రాక్టరు వెళ్లిన ఆనవాళ్లు ఉన్నాయని, అది తగిలి ఆటో బోల్తా పడొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పాదచారిని ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి



కరుణాకర్

వర్గల్: ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా శునకం అడ్డు రాగా అదుపు తప్పి.. రోడ్డు దాటుతున్న మరొకరిని ఢీకొట్టగా.. ద్విచక్రవాహనదారుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వర్గల్ ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మర్కూక్ మండలం పాములపర్తికి చెందిన నీల కరుణాకర్(29) వంటిమామిడి సమీపంలోని ఓ కంపెనీలో ఉద్యోగి. బుధవారం రాత్రి విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికెళ్తున్నాడు. రాజీవ్ రహదారిపై అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో రోడ్డు దాటుతున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దీపక్‌ను బైక్‌తో ఢీకొట్టాడు. గాయపడిన ఇద్దరినీ 108 వాహనంతో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కరుణాకర్ పరిస్థితి విషమించడంతో లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కరుణాకర్ సోదరుడు శేఖర్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కుమారుడికి అన్నీ తానై తల్లి అంత్యక్రియలు



దుబ్బాక, న్యూస్‌టుడే: చేతికొచ్చిన కొడుకు అండగా ఉంటాడను కుంది. కానీ అనారోగ్యంతో మృతిచెందడంతో తల్లి అంత్యక్రియలు నిర్వహించిన హృదయ విదారక ఘటన దుబ్బాకలో గురువారం చోటుచేసుకుంది. వివరాలివీ.. 13వ వార్డుకు చెందిన బెల్లె రాజవ్వకు ఇద్దరు కూతుళ్లు(వివాహాలు జరిగాయి), ఒక కుమారుడు. రాజవ్వ భర్త మల్లయ్య కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడు కనకరాజు(25) కూలీ పని చేస్తూ తల్లిని పోషించేవాడు. మూడు నెలలుగా తీవ్ర అనారోగ్యం బారిన పడి బుధవారం రాత్రి ములుగు ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా తల్లి అంత్యక్రియలు నిర్వహించింది. తోడుగా ఉంటాడనుకున్న కుమారుడికి కన్న తల్లి అంత్యక్రియలు చేపట్టడం స్థానికులను కలచివేసింది.

ఆత్మరక్షణ విద్యకు వెన్నుదన్ను

రూ.15వేల చొప్పున నిధుల మంజూరు

న్యూస్‌టుడే, సిద్దిపేట, హుస్నాబాద్ గ్రామీణం, చేగుంట, వికారాబాద్ కలెక్టరేట్

నిత్యం మహిళలు, బాలికలపై ఎక్కడో ఓ చోట దాడులు జరుగుతూనే ఉన్నాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు బాలికలకు ఆత్మవిశ్వాసం పెరిగేలా, స్వీయరక్షణకు ఉపయోగపడేలా ప్రభుత్వం ఆత్మరక్షణ విద్య కరాటే నేర్పిస్తోంది. ఇందుకు అవసరమైన నిధులను విడుదల చేసింది. ఈ మేరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు పాఠశాలలను ఎంపిక చేయగా, నిర్దేశించిన కాలంలో శిక్షణ ఇవ్వనున్నారు.



కరాటే నేర్చుకుంటున్న బాలికలు

879 పాఠశాలల్లో..

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో రాణి లక్ష్మిబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ పేరిట కరాటే సాధన చేయించనున్నారు. ఇందుకు ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత, కస్తూర్బా పాఠశాలలను ఎంపిక చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి నాలుగు జిల్లాల్లోని 699 పాఠశాలల్లో దీన్ని అమలు చేస్తున్నారు. నవంబరు నుంచి మూడు నెలల పాటు దీన్ని కొనసాగిస్తారు. ఆయా ప్రాంతాలకు చెందిన శిక్షకులను నియమించారు.

కరాటే శిక్షణకు ఎంపిక ఇలా..

	పాఠశాలలు	నిధులు(రూ.లక్షల్లో..)
మెదక్	191	28.65
సంగారెడ్డి	250	37.50
సిద్దిపేట	258	38.71
వికారాబాద్	180	27.00

వారానికి రెండు తరగతులు

శిక్షకులకు సొంత మండలంలోని పాఠశాలల బాధ్యత అప్పగించారు. వీరు వారానికి రెండు తరగతుల చొప్పున ఆత్మరక్షణ విద్య నేర్పిస్తారు. నెలకు రూ. 5 వేల చొప్పున వేతనం చెల్లిస్తారు ఒక్కో పాఠశాలకు రూ. 15 వేల చొప్పున మంజూరయ్యాయి.

నైపుణ్యాలు నేర్పిస్తాం:



పాఠశాలల్లో బాలికలకు కొన్నేళ్లుగా కరాటే నేర్పిస్తున్నా. ఎవరైనా దాడి చేస్తే ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పిస్తూ సొంతంగా రక్షించుకునేలా విద్య నేర్పిస్తున్నాం. దీని ద్వారా బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ధైర్యంగా వెళ్లగలుగుతారు.

భూక్యా రమేశ్, కరాటే శిక్షకుడు

వచ్చే నెల 1 నుంచి..:



కరాటే శిక్షణకు నిధులు మంజూరయ్యాయి. ఇన్‌స్ట్రక్టర్ల నియామకం కూడా పూర్తయింది. ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయి. నవంబరు 1 నుంచి నిధులు మంజూరైన అన్ని పాఠశాలల్లో శిక్షణ ప్రారంభిస్తాం. బాలికలకు ఆత్మరక్షణ విద్య చాలా అవసరం. వారిలో ఆత్మవిశ్వాసాన్ని, మనోధైర్యాన్ని నింపుతుంది.

శ్రీనివాసరెడ్డి, సిద్దిపేట డీఈవో

కలగన్నారు.. ఖాకీ ధరించారు!



రికార్డులు తనిఖీ చేస్తున్న శిక్షణ ఎస్సై హారిక

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్

పోలీసు యూనిఫాం ధరించాలనేది వారి కల.. కష్టాలకు ఎదురీది దాన్ని నిజం చేసుకున్నారు. సంకల్పం, పట్టుదల ఉండాలే ఖాకీ దుస్తులు ధరించడం కష్టమేమి కాదని నిరూపించారు ఈ ముగ్గురు యువ మహిళా ఎస్సైలు. పోలీసు నియామక పరీక్షలో ఉద్యోగాలు సాధించి సంగారెడ్డి జిల్లాలో సబ్ ఇన్‌స్పెక్టర్ శిక్షణలో ఉండటం విశేషం.

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, పటాన్‌చెరు, అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్లలో శిక్షణ ఎస్సైలుగా వికారాబాద్ జిల్లాకు చెందిన ఎ.హారిక, డి.కావేరి, హిమబిందు నెల రోజుల శిక్షణ పొందుతున్నారు. కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ నిర్వహించే విధులు సహా పెట్రోలింగ్, బ్లూకోల్ట్, పగలు, రాత్రి వేళల్లో వాహన తనిఖీలు, కోర్టు విధులు, నేరాలు జరిగినప్పుడు స్పందించాల్సి విధానంపై అవగాహన పెంచుకుంటున్నారు. ఆయా పోలీస్ స్టేషన్‌లోని ఎస్సైల సహకారంతో విధులు, బాధ్యతలు తెలుసుకుంటున్నారు.

యూనిఫామ్‌పై మక్కువతో..


నా పేరు ఎరువ హారిక. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం చీమలదరి స్వగ్రామం. అమ్మ బాలమణి టైలర్, నాన్న శేఖర్ ప్రైవేటు పరిశ్రమలో పని చేసున్నారు. వారు కష్టపడి నన్ను పీజీ చదివించారు. తమ్ముడు సూర్యకిరణ్ ఫ్లయింగ్ అధికారిగా పనిచేస్తున్నాడు. పోలీసు యూనిఫామ్ ధరించాలని చిన్నపటి నుంచి కోరిక. టీజీపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం అవుతుండగా ఎస్సైల భర్తీ ప్రకటన వచ్చింది. ఓ సారి ప్రయత్నిద్దామని దరఖాస్తు చేశా. తొలి ప్రయత్నంలోనే అవకాశం దక్కింది. మా కుటుంబంలో నేనే తొలి ప్రభుత్వ ఉద్యోగిని కావడం ఆనందంగా ఉంది.

ఉపాధ్యాయురాలు కావాలనుకొని..



నా పేరు దూది కావేరి. మాది వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం గాంధీచౌక్ ప్రాంతం. అమ్మ నిర్మల గృహిణి, నాన్న వీరేశం సెక్యూరిటీ సూపర్‌వైజర్, అన్నయ్య భానుప్రసాద్. పాఠశాల విద్యను తాండూరులోని శిశు మందిర్, ఇంటర్ హైదరాబాద్‌లో చదివా. డీఈడీ టీచర్ శిక్షణ పూర్తి చేశా. అనంతరం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశా. ఉపాధ్యాయురాలు కావాలని టీటీసీ పూర్తి చేసినా.. ఎస్సై నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేశారు. తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం వచ్చింది.

గ్రూప్స్‌కి సిద్ధమవుతుండగా..



నా పేరు నాంచెరి హిమబిందు. వికారాబాద్ పట్టణం పులుసు మామిడి స్వగ్రామం. నాన్న రాంరెడ్డి జీహెచ్ఎంసీ ఉద్యోగి, అమ్మ లక్ష్మి గృహిణి. తమ్ముడు హర్షవర్ధన్‌రెడ్డి సివిల్స్ శిక్షణ పొందుతున్నాడు. నర్సాపూర్ బీవీఆర్ఐటీలో ఈఈఈ పూర్తి చేయగా ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగం వచ్చింది. దాన్ని కాదనుకొని గ్రూప్స్ సాధించాలని సిద్ధమయ్యా. ఎస్సై నోటిఫికేషన్ రావడంతో ప్రయత్నించా. తొలి ప్రయత్నంలోనే ఎస్సై ఉద్యోగం సాధించా. లక్ష్యాన్ని నిర్దేశించుకుని శ్రమిస్తే సాధించడం కష్టమేమి కాదు.

ఎన్ఎస్ఎస్‌తో వ్యక్తిత్వ వికాసం: ఏఎస్పీ



మాట్లాడుతున్న ఏఎస్పీ మహేందర్ చిత్రంలో అధ్యాపకులు

మెదక్ టౌన్: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ద్వారా వ్యక్తిత్వ వికాసం, జీవన విలువలు పెంపొందించుకోవడానికి దోహదపడుతుందని ఏఎస్పీ మహేందర్ విద్యార్థులకు సూచించారు. గురువారం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సమైక్యత భావం కలుగుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత చదువుల్లో ఎన్ఎస్ఎస్ ఉన్న విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. సైబర్ క్రైం డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. షీ టీం సీఐ నాగరాజు గౌడ్, భరోసా కేంద్రం అధికారులు శ్వేత, సౌమ్య, చరిత్ర విభాగాధిపతి గణపతి, ఎన్ఎస్ఎస్ అధికారి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు మల్లేశం, నాగరాజు, మురళి, సుధాకర్, దేవదాసు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

పాపన్నపేట: కేటీఆర్ వ్యక్తిత్వాన్ని అవమాన పరిచేలా కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు చేయడం సరికాదని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. సంజయ్ వ్యాఖ్యలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, సీఎం రేవంత్‌రెడ్డితో రహస్యంగా కలిసిపోయి ఇలా మాట్లాడటం సమంజసం కాదన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు కరవు



నీటిపారుదల శాఖ కార్యాలయంలో తహసీల్దార్ కార్యాలయం

న్యూస్‌టుడే, నర్సాపూర్: ఎక్కడైనా అభివృద్ధి పనులు జరగడం లేదంటే అధికారులు, ప్రజాప్రతినిధులు నిధుల లేమి ప్రధాన సమస్యగా చూపుతుంటారు. కాని నియోజకవర్గ, డివిజన్ కేంద్రం నర్సాపూర్‌లో మాత్రం 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్నట్లు నిధులున్నా స్థల సమస్య వేధిస్తోంది. దీంతో నర్సాపూర్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరవై ఆయా భవనాల్లో కొనసాగుతున్నాయి. దీనిపై ప్రజాప్రతినిధులు కీలకమైన స్థలాల సమస్యను పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

స్థలాలు లేవంటూ..: అందరికి పక్కా భవనాల నిర్మాణానికి స్థలాలు కేటాయించే తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేదు. పాత భవనం శిథిలావస్థకు చేరుకోగా కూల్చారు. అక్కడే పక్కా భవనాల నిర్మాణానికి రూ.75లక్షల నిధులు మంజూరై ఎనిమిదేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. గుత్తేదారు కొంతవరకు పనులు చేపట్టి వదిలేశారు. దీంతో అక్కడ సమీకృత మార్కెట్ నిర్మాణాన్ని రూ.4కోట్లతో పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం నీటి పారుదల శాఖ అతిథి గృహంలో నిర్వహిస్తున్నారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయం పశుసంవర్ధక శాఖకు చెందిన భవనంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు.



పశుసంవర్ధక శాఖ భవనంలో రెవెన్యూ డివిజన్ కార్యాలయం

అతిథి గృహమే ఆబ్కారీకి దిక్కు

ఆబ్కారీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తొలగించారు. సమీకృత మార్కెట్‌ను విస్తరించాలని ఆ కార్యాలయాన్ని నీటి పారుదలశాఖ అతిథి గృహంలోకి మార్చారు. ఆరు మండలాలకు సేవలందించే ఆబ్కారీ కార్యాలయం ప్రస్తుతం దారుణ స్థితిలో ఉంది. హైదరాబాద్ మార్గంలో ప్రభుత్వ స్థలం కేటాయించి రూ.50లక్షలు మంజూరు చేశారు. స్థలం తమదే అంటూ కొందరు కోర్టులో కేసు వేశారు. దీంతో పనులు ప్రారంభించ లేని దుస్థితి.

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుంది. హైదరాబాద్ రోడ్డు పక్కనే ప్రభుత్వ స్థలం కేటాయించగా, భవన నిర్మాణానికి రూ.60లక్షలు మంజూరు చేశారు. స్థలం వివాదంలో పడగా పనులు చేయలేని దుస్థితి. సహాయ కార్మిక శాఖ అధికారి కార్యాలయం మార్కెట్ రోడ్‌లో ఒక గదిలో నెట్టుకొస్తున్నారు. జూనియర్ సివిల్ కోర్టు భవనం భారీ వర్షాలకు కూలడంతో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలోకి తరలించారు. ఐసీడీఎస్ కార్యాలయాన్ని సీఎల్ఆర్సీ భవనంలోకి మార్చారు. కోర్టు భవనం నిర్మాణానికి నిధులున్నా స్థలం లేదు. అదనపు కోర్టు మంజూరు కాగా పాత ఐసీడీఎస్ భవనంలో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

భవనాల నిర్మాణానికి కృషి: సునీతారెడ్డి, ఎమ్మెల్యే, నర్సాపూర్

నర్సాపూర్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేక ఉద్యోగులు, ఆయా పనులపై వెళ్లినవారు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. అనువైన ప్రభుత్వ స్థలాల అన్వేషణలో ఉన్నాం. దశల వారిగా కార్యాలయాలకు పక్కా భవనాల నిర్మాణానికి కృషి చేస్తాం.

న్యూస్‌టుడే, అల్లాదుర్గం

? అకోలా-హైదరాబాద్-161జాతీయ రహదారి పక్కన చిల్వేర్ శివారులో మిషన్ భగీరథ పైపు లైన్ లీకై నీరు వృథాగా పోతోంది. - లక్ష్మణ్, చిల్వేర్

✓ క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. - రఘునాథ్, మిషన్ భగీరథ, అల్లాదుర్గం

గుర్రపు డెక్క తొలగించారు

ఈనాడు కథనానికి స్పందన

న్యూస్‌టుడే, నర్సాపూర్: తూప్రాన్ మార్గంలోని కోమటికుంటలో గుర్రపు డెక్క ఆవరించింది. సమస్యపై ఈ నెల 1న 'కుంట నిండా గుర్రపు డెక్క' శీర్షికన 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. కుంట జాతీయ రహదారిని ఆనుకుని ఉండటం ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో మత్స్యకారులు స్వచ్ఛందంగా గుర్రపు డెక్క తొలగించారు.

బాబోయ్ శునకాలు



టేక్మాల్ వీధుల్లో గుంపుగా సంచరిస్తూ..

మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువ అయిపోయింది. ఇంటి నుంచి చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే జంకుతున్నారు. వీధుల్లో శునకాల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాలకు వెళ్లే సమయాల్లో విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల్లో 22 మంది కుక్క కాటుకు గురై టేక్మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకాలు తీసుకున్నారని వైద్యులు తెలిపారు. - న్యూస్‌టుడే, టేక్మాల్

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ హుస్సేన్, అధ్యాపకులు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్బీఐ స్థాపించి 90ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్బీఐ క్విజ్ పోటీలు నిర్వహించింది. కళాశాల నుంచి బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కార్తిక్, వైష్ణవి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబరు 18న ఆన్‌లైన్ విధానంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కామర్స్ అధ్యాపకులు చంద్రశేఖర్, శ్రీనివాస్, హరిత, రేఖ తదితరులున్నారు.

సార్వత్రిక విద్య ఫీజు గడువు పెంపు

పాపన్నపేట, న్యూస్‌టుడే: సార్వత్రిక విద్య ఇంటర్, పదో తరగతి ఫీజు చెల్లించేందుకు గడువు పెంచినట్లు పాపన్నపేట ఉన్నత పాఠశాల కోఆర్డినేటర్ హరిబాబు తెలిపారు. గతంలో సెప్టెంబర్ 30 వరకు చివరి తేదీ ఉండగా రూ.200 అపరాధ రుసుముతో ఈ నెల 30 వరకు పొడిగించినట్లు తెలిపారు.

రైస్ మిల్లు లీజు వేలం.. రూ.6లక్షల ఆదాయం

పాపన్నపేట, న్యూస్‌టుడే: కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఉన్న రైస్ మిల్లును లీజుకు ఇచ్చేందుకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.6.70లక్షల ఆదాయం వచ్చినట్లు సంఘం ఛైర్మన్ రమేష్ గుప్త తెలిపారు. ఆయా గ్రామాల నుంచి 9మంది పాల్గొన్నారు. కుర్తివాడకు చెందిన తమ్మి పాండురంగం వేలంలో మిల్లును దక్కించుకున్నారని తెలిపారు.

రాష్ట్ర క్రీడా సారథిగా ఎంపికైన విద్యార్థికి సన్మానం

శివ్వంపేట, న్యూస్‌టుడే: మండలంలోని దొంతి గ్రామానికి చెందిన తరుణ్ తేజ్ ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ అండర్-17 విభాగం జట్టు సారథిగా ఎంపికైన సందర్భంగా గ్రామానికి చెందిన భవనాగారి శ్రీనివాస్ గురువారం విద్యార్థిని సత్కరించారు. త్వరలో పెద్దపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడలకు ఆర్థిక సాయం అందించారు. ఆనంద్, మురళి, రవి, రాజు తదితరులున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎంపీకి ఆహ్వానం

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: మండల పరిధి కామారంలో ఈ నెల 28న పోచమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ఠ, బోనాల పండుగకు రావాలని కోరుతూ ఎంపీ రఘునందన్‌రావును పేట భాజపా నాయకులు కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఎంపీ నివాసంలో చిన్నశంకరంపేట భాజపా మండల ప్రధాన కార్యదర్శి దశరథం, రమేష్ ఆహ్వాన పత్రిక అందజేశారు.

రుణాలతో మహిళల ఆర్థికాభ్యున్నతి



మాట్లాడుతున్న అశోక్‌గౌడ్, రామకృష్ణారావు, ఇందిర

నర్సాపూర్, న్యూస్‌టుడే: ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వ్యక్తిగత రుణాలను పొందిన మహిళలు సొంతంగా యూనిట్లను నెలకొల్పి ఆర్థికాభ్యున్నతి సాధించాలని పురపాలిక అధ్యక్షుడు అశోక్‌గౌడ్ సూచించారు. పట్టణంలోని పురపాలికలో పట్టణ పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఐకేపీ యూనిట్లపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక అవసరాలు తీర్చుకుంటూ కుటుంబాలను బలోపేతం చేసుకోవాలన్నారు. కమిషనర్ రామకృష్ణారావు మాట్లాడుతూ.. కోటి మహిళలు-కోటీశ్వరులు కార్యక్రమంలో భాగంగా మహిళలను ఆర్థికంగా శక్తివంతులను చేయాలనేది ప్రభుత్వాల లక్ష్యమన్నారు. జిల్లా మెప్మా అర్బన్ పీడీ ఇందిర మాట్లాడుతూ..నర్సాపూర్ పురపాలికలో 16 యూనిట్లు ఏర్పాటు లక్ష్యం కాగా 10 పూర్తి చేశామన్నారు. పథకం విస్తరణ అధికారి రాజీవ, మేనేజర్ మధుసూదన్, మెప్మా అధికారిణి దేవపాల తదితరులున్నారు.

ధరణి దస్త్రాలను పరిశీలించిన ఆర్డీవో

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: నిషేధిత భూముల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుని ఆక్రమణకు గురికాకుండా చూడాలని రెవెన్యూ అధికారులకు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. గురువారం చిలప్‌చెడ్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, ధరణికి సంబంధించిన దస్త్రాలను పరిశీలించారు. అనంతరం పట్టభద్రుల ఎన్నికల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. తహసీల్దార్ ముసాదిక్, ఎంపీడీవో ఆనంద్ ఉన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి: భాజపా



వెల్దుర్తి: సభ్యత్వ నమోదులో పాల్గొన్న మురళీధర్‌గౌడ్, రఘువీరారెడ్డి

వెల్దుర్తి, నర్సాపూర్ రూరల్, నర్సాపూర్, కొల్చారం, న్యూస్‌టుడే: భాజపాతోనే దేశం సురక్షితమని ప్రధాని మోదీకి మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమ కన్వీనర్ మురళీధర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి వెల్దుర్తిలో భాజపా సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. కుల, మతాలకు అతీతంగా భాజపా సభ్యత్వం తీసుకోవాలన్నారు. భాజపా నర్సాపూర్ కన్వీనర్ రమణరావు, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, వెల్దుర్తి మండలాధ్యక్షుడు నర్సింలు, సుదర్శన్ తదితరులున్నారు. నర్సాపూర్ పట్టణం, రెడ్డిపల్లిలో భాజపా జిల్లా ఇన్‌ఛార్జి మురళీధర్‌గౌడ్, నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్, చిన్న రమేష్‌గౌడ్ సభ్యత్వ నమోదును పరిశీలించారు. కొల్చారం మండలం వరిగుంతంలో కేంద్ర పథకాల గురించి ప్రజలకు వివరించి సభ్యత్వం నమోదు చేశారు. మండలాధ్యక్షుడు దయాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నాని, మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులున్నారు.

అద్దె భవనంలో ఇబ్బందులు



మండల పరిధి బస్వాపూర్‌లో పంచాయతీ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శితో పాటు ఆయా పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో ఉమాదేవిని అడగ్గా.. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి నిధుల మంజూరు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. నిధులు రాగానే భవన నిర్మాణం చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, వెల్దుర్తి

రాళ్లుతేలి.. అధ్వానంగా మారి



హవేలీఘనపూర్ మండలం ముత్తాయికోట గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. హవేలి ఘనపూర్ నుంచి కూచన్‌పల్లికి గ్రామానికి రోడ్డు నిర్మించి ఏళ్లు గడవడంతో మొరం, మట్టి కొట్టుకుపోయి రాళ్లు తేలాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తారు రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హవేలీఘనపూర్

ప్రభుత్వ భూమిని కాపాడండి: సీపీఎం

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమిని కాపాడకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఎర్ర జెండాలను పాతి ఆందోళన చేస్తామని ఆ పార్టీ నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు హెచ్చరించారు. గురువారం మండలంలోని తిమ్మాపూర్‌లో ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబరు-70లో 124 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా ఇందులో 16 ఎకరాల భూమి ధరణి వచ్చిన తర్వాత రెవెన్యూ అధికారుల అండదండలతో నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించారని ఆరోపించారు. వెంటనే ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: తపస్ ఉపాధ్యాయ సంఘ బాధ్యులు గురువారం ఎమ్మెల్సీ ఓటరుపై అవగాహన కల్పించారు. కస్తూర్బా పాఠశాలతో పాటు పలు ఉపాధ్యాయులకు, పట్టభద్రులకు గడువులోగా ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. సంఘం మండల అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి కాన్షీరాం జాదవ్ తదితరులున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



పెద్దశంకరంపేట: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శంకర్

పెద్దశంకరంపేట, రేగోడ్, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శంకర్ సూచించారు. గురువారం పెద్దశంకరంపేట ఉత్తులూరు చౌరస్తా వంతెన వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. అపరిచితులకు ఫోన్ చేస్తే వ్యక్తిగత వివరాలు, ఓటీపీ నంబర్లు చెప్పవద్దన్నారు. టి.లింగంపల్లి కూడలిలో సైబర్ నేరాల నియంత్రణపై ఎస్సై పోచయ్య ప్రజలు అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వాటిని నిర్ధారించుకోవాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేయాలన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించాలని వినతి

చిలప్‌చెడ్: చిలప్‌చెడ్‌లో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మించాలని భాజపా మండల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందజేశారు. గురువారం మెదక్ వైద్య కళాశాల ప్రాంగణంలో మంత్రిని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, మాజీ మండలాధ్యక్షుడు దశరథ నాయకులతో కలిసి విన్నవించారు. ఏర్పాటుకు సానుకూలత వ్యక్తం చేశారని వారు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: మండల పరిధి అల్లాదుర్గం ఐబీ చౌరస్తా వద్ద వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపనకు మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం భూమి పూజ చేసినట్లు ఆ సంఘం సభ్యులు దశరథ్, బేతయ్య తెలిపారు.

27న ఉచిత వైద్య శిబిరం

శివ్వంపేట, న్యూస్‌టుడే: మండలంలోని రత్నాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 27న హైదరాబాద్ రామకృష్ణ మఠం గ్రామ శ్రీసేవ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మఠం ప్రతినిధి వేణు తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తామన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి

గజ్వేల్, న్యూస్‌టుడే: అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మేలు జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో భారాసకు చెందిన పలువురు కార్యకర్తలు గురువారం ఆయన సమక్షంలో పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు. గజ్వేల్ మార్కెట్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ సర్దార్ ఖాన్, సుఖేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ట్యాంకు



ప్రజల నీటి అవసరాల కోసం నిర్మించిన చిన్ననీటి ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. మెదక్ పురపాలిక 1వ వార్డు ఔరంగాబాద్ పరిధిలో మూడు నీటి ట్యాంకులను నిర్మించగా గతంలో ప్రజలు అక్కడికి వెళ్లి నీటిని తెచ్చుకునేవారు. వార్డు పరిధిలో బోరు మోటారు ఉండడంతో ట్యాంకులకు అనుసంధానం చేసి వినియోగించుకునేవారు. తర్వాత నిర్వహణ సరిగా లేక ట్యాంకులు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతున్నాయి. బోరు నిరంతరం ఆడటంతో నీరు, విద్యుత్తు వృథా అయి మోటార్లు కాలిపోతున్నాయి. ఇప్పటికైనా స్థానిక కౌన్సిలర్, సంబంధిత అధికారులు బోరును ట్యాంకులకు అనుసంధానం చేసి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మెదక్ టౌన్

ప్రమాదకరంగా నియంత్రికలు.. ఆందోళనలో విద్యార్థులు

న్యూస్‌టుడే, వెల్దుర్తి, చేగుంట, అల్లాదుర్గం: విద్యుత్తు నియంత్రికలు పలు గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్నాయి. వెల్దుర్తి మండలం మహ్మద్‌నగర్ తండా ప్రాథమిక పాఠశాల ఆవరణలో నియంత్రిక చిన్నారుల పాలిట ప్రమాదకరంగా మారింది. పాఠశాల ముందే చిన్నపాటి ఆటస్థలం ఉండగా అక్కడే నియంత్రిక ఉండడంతో చిన్నారులు నిర్భయంగా ఆటలు ఆడేందుకు జంకుతున్నారు. ఆవరణలో నియంత్రిక ఉండడమే కాకుండా విద్యుత్తు తీగలు చాలా కిందకు వేలాడుతున్నాయి. చిన్నారులు ఆడుకునేటప్పుడు ఉపాధ్యాయులు కాపలా ఉండాల్సిన దుస్థితి. పాఠశాల పనివేళల్లో ఉపాధ్యాయులు ఉంటారు. కాని సెలవు రోజుల్లో చిన్నారులు పాఠశాల ఆవరణలోనే ఆడుకుంటారు. అప్పుడు రక్షణ ఎలా అని తండావాసులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాలలోనే అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ఇప్పటికైనా విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



మహ్మద్‌నగర్ తండా పాఠశాల ఆవరణలో..



రుక్మాపూర్‌లో..

● చేగుంట మండలం రుక్మాపూర్‌లో ప్రాథమిక పాఠశాల పక్కనే రెండు నియంత్రికలను ఒకే గద్దెపై ఏర్పాటు చేశారు. దీంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. చిన్నారులు దీని పక్క నుంచే భయపడుతూ వెళుతుంటారు. పొరపాటున తీగను పట్టుకుంటే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. అలాగే బోనాల వైపు నుంచి వాహనాలు అతివేగంగా వస్తుంటాయి. అదుపు తప్పి నియంత్రికలను ఢీకొంటే ప్రమాదం తప్పదు.

● అల్లాదుర్గం మండలం అకోలా,హైదరాబాద్-161 జాతీయ రహదారి నుంచి మాందాపూర్ వెళ్లే రోడ్డుకు చిల్వేర్ శివారులో నియంత్రిక ప్రమాదకరంగా మారింది. ఆదమరిచి వాహనాలను నడిపితే విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలి. లేదంటే వేరే చోటకు మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఆ మండల విద్యుత్తు ఏఈ శివాజీని అడగ్గా. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కంచె ఏర్పాటు చేస్తాం: వెంకటేశ్వర్లు, ఏఈ విద్యుత్తు శాఖ, వెల్దుర్తి

మహ్మద్‌నగర్ తండా పాఠశాల ఆవరణలో నియంత్రిక వద్ద కంచె ఏర్పాటుకు అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాం. ఇంకా మంజూరు కాలేదు. అవి రాగానే కంచె ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

మహిళ మృతి కేసులో ముగ్గురి రిమాండ్

కౌడిపల్లి, న్యూస్‌టుడే: విద్యుత్తు కంచెతో మహిళ మృతిచెందిన కేసులో ముగ్గురిని రిమాండ్ చేసి కోర్టుకు తరలించినట్లు కౌడిపల్లి ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 22న మండలంలోని జాజితాండ పంచాయతీకి చెందిన కాట్రోత్ బుజ్జిబాయితో పాటు రెండు మేకలు విద్యుత్తు కంచెతో మృతి చెందాయి. ఈ కేసులో విద్యుత్తు కంచె ఏర్పాటు చేసిన తండాకు చెందిన పాల్త్య శోభ ఆమె కుమారులు నరేశ్, రమేశ్‌లపై కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితులను సిద్దిపేట మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్లు ఎస్సై చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రామాయంపేట, న్యూస్‌టుడే: ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన రామాయంపేట పట్టణ శివారులో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన మరుకు వెంకటేష్ ద్విచక్రవాహనంపై అక్కన్నపేట నుంచి రామాయంపేట వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారి వంతెన వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడు వెంకటేష్‌ను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా మారడంతో సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ కేంద్రాల్లోనే మద్దతు ధర



రాంపూర్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ మల్లేశం

చిన్నశంకరంపేట, అల్లాదుర్గం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని చందంపేట సహకార సంఘం ఛైర్మన్ సత్యనారాయణ రైతులకు సూచించారు. సహకార సంఘం పరిధిలోని రుద్రారం, దరిపల్లి, బార్తిపల్లి, చందంపేట, సూరారం గ్రామాల్లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. సిద్దిరాంరెడ్డి, సిద్దారెడ్డి, దయానంద్, లక్ష్మణ్, శేఖర్ తదితరులున్నారు. రాంపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మల్లేశం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శేషారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బల్‌రాం, మహేష్, జైపాల్ తదితరులున్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ

పెద్దశంకరంపేట, మనోహరాబాద్, న్యూస్‌టుడే: రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేలా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ చేపట్టాలని తహసీల్దార్ గ్రేస్‌బాయి సూచించారు. గురువారం పేట తహసీల్ కార్యాలయంలో సెర్ప్, పీఏసీఎస్ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వర్షాలు ఉన్నందున సేకరించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. ఆర్ఐ శరణప్ప, ఏపీఎం గోపాల్ తదితరులున్నారు. మనోహరాబాద్‌లో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పీఏసీఎస్, ఐకేపీ సిబ్బంది, ఏఈవోలతో సమావేశం నిర్వహించారు. ఆర్ఐ దీక్షిత్, ఏఈవోలు పాల్గొన్నారు.